# ఆర్థికోపన్యాసాలు

"అంతా అయిపోయింది! భూమీ, ఇల్లూ, వాకిలీ, తోటా దొడ్డీ- సమస్తమూ అప్పులవాళ్ళ పాలయింది. కట్టుగుడ్డలతో వీధిలో నిలబడ్డావు. ఇక ఏం చేస్తావు?"

"ఏమో! ఇంకా నా దగ్గిర అయిదువందల రూపాయలు మిగిలింది. అది అయిపోయిన తరవాత ఆలోచిస్తాను."

"అది కాస్తా అయిపోయిన తరవాత ఇంకా ఆలోచించేదేమిటి? ఆలోచన ఇప్పుడే చెయ్యి. అంతగా అయితే ఏం చెయ్యగలుగుతావో అది యీ కాస్తా అయిపోయిన తరవాత చేస్తువుగాని!"

"ఆలోచించి చేసేదీ ఏమీ కనుపించదు. ఈ డబ్బు అయిపొయ్యేదాకా నిశ్చింతగా ఉండటం తప్ప!"

"ఇది ఎంతకాలం వస్తుందని నీ అభిప్రాయం?"

"జాగర్తగా వాడుకుంటే ఈ కరువులో నెలకొక నలభైతో హాయిగా కాలక్షేపం చెయ్యవచ్చును. ఒక సంవత్సరం వెళ్ళిపోతుంది."

"ఈ వివేకం నీకు నాలుగేళ్ళ క్రితమే ఉంటే? నీ మైనారిటీ వెళ్ళిన ఈ నాలుగేళ్ళలో ఎంత ఖర్చు చేశావో నీకు తెలుసునా?"

"ఏమో!"

నాకు తెలుసు. ఇరవై వేలు. సాలుకు అయిదువేలు! సంవత్సరానికి అయిదువందల చొప్పున ఖర్చు పెట్టుకుంటే నలభై ఏళ్ళ గ్రాసం! నీకీ దరిద్రం లేకపోను!"

"లక్షరూపాయల ఆస్తి నా ఇరవై వేల ఖర్చుకే ఆహుతి అయిపోయిందా? ధరలు మూడోవంతవుతయ్యని నేను కలగన్నానా?"

*                    *                    *

"ఆ డబ్బు జాగ్రత్తగా భద్రంచేసుకొని పొదుపుగా వాడుకుంటున్నావా?"

"అయిపోవచ్చింది. ఇంకో వంద ఏమో ఉంది."

"నాలుగు నెలల్లో నే! నెలకు వంద చొప్పున తగలేశావా?"

"ఎట్లా ఖర్చు పెట్టానో జ్ఞాపకం లేదు. నేనేమీ దుర్వ్యయం చేసినట్టే లేదు. ఎట్లా అయిపోతేనేం అయిపోయినమాట నిజమేకదా?"

"బాగుంది! ఈ వందా మరోనెల్లో ఖర్చుచేసిన ఆపైన ఏంచేస్తావు?"

అది ఎప్పటికైనా ఉన్న సమస్యేగా. నా జీవితమల్లా వెళ్ళిపొయ్యేటందుకు నాదగ్గిర డబ్బు ఎట్లాగూ లేదు. ఎప్పటికో అప్పటికి నేను ఏదో ఒకటి చేసి తీరాలి. అది దేవుడే చెప్పాడు...."

"ఎంత చెట్టు కంతగాలి. అంత ఆస్తిమీదట కాస్తో కూస్తో అప్పుండటం సహజమే అనుకో. అందుకనే నే ననే దేమంటే ఎనభై వేల ఆస్తిపోయినా మిగిలిన ఇరవై వేల ఆస్తి ఉండేదిగా! అప్పుడు ఇరవై వేల ఆస్తి అంటే ఈ రోజుల్లో అధమం యాభై వేల ఆస్తి అన్నమాట.....మాట్లాడవేం?"

"నీ లెక్క నాకు అయోమయంగా ఉంది. అప్పటి ఇరవై వేల ఆస్తి ఇప్పుడారు వేల ఆస్తి అవుతుంది. ఆ రోజుల్లో, ఆ ధరల్లో, ఆస్తంతా అమ్ముకుని ఈ రోజుల్లో కొనుక్కుంటే నువు చెప్పే మాటలో ఏమైనా అర్థం ఉంటుంది. ఆస్తి యావత్తూ అమ్ముకుని డబ్బు చెయ్యాలని నాకెట్లా తట్టుతుంది?"

"నీకు బ్రహ్మదేవుడు కూడా చెప్పలేడు. నీకు అంతా అయిపోయింది. ఇక నువు చేసేదేమీ లేదు– పశ్చాత్తాపపడటమూ, సరి అయిన నీతి నేర్చుకోవటమూ తప్ప!"

"దానివల్ల ప్రయోజనం కనిపించదు."

"పోనీ, నీ ఖర్మం! నేనేం చెయ్యను?"

* * *

"ఆ గోపాలంగాడికి పాతిక రూపాయ లిచ్చావుటగా? నీకున్న సంపద లోంచి!"

"నువ్వయితే ఏం చేస్తావు? వాడి భార్య మంచాన పడింది. పిల్లలిద్దరూ మంచాన పడ్డారు. రెండోవాడు చావటానికి సిద్ధంగా ఉన్నాడు. డాక్టరు ఇంజక్షన్లు చెయ్యాలన్నాడుట. మళ్ళీ పంటదాకా గోపాలం చేతికి కానీరాదు."

"అవుననుకో. అయితే మాత్రం తనకు మాలిన ధర్మమా?"

"ఇందులో తనకు మాలిన ధర్మం ఏముంది? నా దగ్గిర ఇంకా పాతికో ముప్పయ్యో ఉన్నై."

"మిగిలిం దంతా ఖర్చయిందీ? నాలుగు రోజుల క్రితమేగా వంద ఉన్నయ్యన్నావు?"

"ఖర్చయింది."

"ఎట్లా?"

"ఏమో! ఏం చెప్పను? దానికీ దీనికీని!"

"అయ్యయ్యో! ఈ విధంగా నీ కెప్పటికి వివేకం వస్తుంది? నాకు తెలుసును. ఇంకా నువ్వా సత్యనారాయణనూ, సూర్యనారాయణనూ పూసుకు తిరుగుతావు. వాళ్ళకేం పెద్ద ఉద్యోగస్తులు. రూపాయలు పరిచి వాటిమీద నడుస్తారు. అదివరకల్లా అట్లా చేసే నీ సంగతి ఇట్లా అయింది. ఇప్పటికైనా వాళ్ళని వదిలెయ్యరాదూ?....మాట్లాడవేం?"

"ఏం మాట్లాడను? నా డబ్బంతా పోయిన తరవాత నాకు కనీసం ఒక మహోపకారం జరిగింది. నా పెద్ద స్నేహితు లెవరున్నారో వాళ్ళంతా జారుకున్నారు. నాకు మిగిలిఉన్న కొద్దిమందినీ చూస్తూ చూస్తూ ఎట్లా వదులుకోను?"

"వాళ్ళిద్దరూ నీకు మంచి స్నేహితూ లేం? వాళ్ళతో పరుగులు తియ్యలేని మర్నాడు తెలుస్తుంది వాళ్ళు నీ కెంత మంచి స్నేహితులో!.... అంత మంచి స్నేహితులైతే నీకొక చిన్న ఉద్యోగం ఇప్పించరాదూ?"

"నే నడిగితే ఇప్పిస్తారు?"

"అడక్కుండా ఇప్పించలేదేం? అదేనా వాళ్ళ స్నేహితం?"

"కొంచెం ఆలోచించు. వాళ్ళతో పాటుగా తిరిగిన వాడికి ఏదో చిన్న ఉద్యోగం ఇప్పించటం వాళ్ళకు అవమానం చెయ్యటమల్లే ఉండదా?"

"ఉద్యోగం తీసుకోవటం నీ కవమాన మల్లే ఉంది! అంతకన్న ఇంకేమీ కనిపించలేదు! ఒక చెంప దారిద్ర్యం ఆవేశించి ఉంటే మొహమాటాలా?"

"ఎందుకు కాకూడదు? దారిద్ర్యం పెద్ద సమస్య కాదు. నువు చిన్నతనం నించీ దారిద్ర్యం అనుభవించావు. వారాలు చేసుకుని చదువుకున్నావు. పరీక్షలు ఫస్టున పాసయినావు. కాలేజీలోనించి తీసిన అడుగు ఆఫీసులో పెట్టావు. నీకు దారిద్ర్యం సమస్య అయిందా? ఒక పూట తిండి లేకుండా నువు గడిపినట్టే నేనూ గడవగలను. అది కష్టం కాదు. కాని నీ మాదిరిగా నేను తిండి తినలేనని ఎవరితోనూ చెప్పలేను. ఒక పూట తిండికి ఎవరినీ ఆశ్రయించలేను. నా దగ్గిర డబ్బుండగా ఎవరి డబ్బయినా నిశ్చింతగా ఖర్చు చేశాను. నా దగ్గిర కానీకూడా లేనప్పుడు ఆ కానీ మరొకరిని అడిగి పుచ్చుకోలేను. నీ కా తేడా లేదు. అసలు సమస్య దారిద్ర్యం కాదు– సంస్కారం! నా స్నేహితులైనా దారిద్ర్యంకన్న నా సంస్కారాన్ని ఎక్కువగా చూస్తారు. అట్లా చూడగలిగిన వాళ్ళనే నేనింకా స్నేహితులుగా భావిస్తున్నాను."

"నువ్వు సంస్కార మనేది ధన మదాంధత్వం"

"కావచ్చును!"

"జీవితం తెలుసుకోక ఊహా ప్రపంచంలో ఉండిపోయి ఇటువంటి మాటలు మాట్లాడతారు!"

"ఊహా ప్రపంచంలోకి ఎన్నడూ పోక జీవితమంతా కూడికలూ హెచ్చవేతలూ అనుకోవటం మాత్రం ఏమంత ఘనమో నా కర్థం కాలేదు."

"అర్థం కానందుకు బాధ నీకా, నాకా?"

"కోపం తెచ్చుకోకు– నా దారిద్ర్యం విషయం నా కన్న నువ్వే మాత్రము తక్కువ బాధపడుతున్నట్టు కనిపించలేదు!"

* * *

"ఎక్కడా కనిపించటం లేదు? మనం కలుసుకుని రెండు నెలలు కాలా?

"పైనే అయింది. నువ్వే వెనుకటి మాదిరిగా రావటం లేదు. నా భార్య ఒకటి రెండు సార్లు అన్నది కూడానూ!"

"అవునవును. నాకీ మధ్య బొత్తిగా తీరటంలేదు....ఎట్లా ఈదుస్తున్నావు?"

"అట్లా!"

"డబ్బంతా అయిపోయింది కాదూ?"

"ఎన్నడో!"

"మరి? –"

"నా భార్య మెళ్ళో గొలుసు అమ్మేశాను."

"ఎంత దారుణం?"

"నీ భార్య మనిషి కాదు దేవత అని నీ కెన్నడన్నా అనిపించిందా?"

"లేదు. నా భార్య నా కెన్నడూ తన నగ లివ్వలేదు!"

"ఎప్పుడన్నా నీ కవసరం కలిగిందా?"

"అనేకసార్లు. నేను నగలమ్ముతా నన్నప్పుడల్లా నా పెళ్ళాం ఏడిచి రాగాలు పెట్టేది!"

"గొలు సమ్మా నన్నావు?"

"అందు కేడవలేదు. తన నగ లమ్మినందుకు నన్నందరూ లోకువగా చూస్తారని."

"ఆస్తంతా పోయినందుకు నీ భార్య దుఃఖించలేదా?"

"దుఃఖించింది. నన్ను పసిపిల్లల్లే కరుచుకుని ఏడిచింది. ఆ మనిషికి నా మీద అంత ప్రేమ ఉందని అదివర కెరగను. ఈ దారిద్ర్యం తెచ్చి పెట్టినందుకు నేను భగవంతుణ్ని ఒక విధంగా మెచ్చుకున్నాను. నాకు నా భార్యని చూపించాడు!"

"నువు దరిద్రుడల్లే మాట్లాడటం నేర్చుకోవాలి. ఈ కబుర్లతో నువ్వు దారిద్ర్యాన్ని ఎదుర్కో-లేవు."

"పర్సు ఇంటి దగ్గిర మరిచిపోయి బజారుకు వెళ్ళిన వాడికంటే, పొరు గూళ్ళో ఉండి డబ్బు పోగొట్టుకున్న వాడికంటే నేను దరిద్రుణ్ని కానేమో!"

* * *

"నీ సంగతి నాకేమీ అర్థం కావటం లేదు. నీకు డబ్బు ఎక్క-ణ్నించి వస్తున్నది? వెనకటికీ ఇప్పటికీ నీలో మార్పేమీ కనిపించదు. ఇట్లా కాలం ఎంత కాలం వెళ్ళబుచ్చగలవు? ఇప్పుడెట్లా వెళ్ళబుచ్చుతున్నావు?"

"నేను దారిద్ర్యంలో ఉండటం చూసి సహించని వాళ్ళు, నేను దారిద్ర్యం అనుభవించటానికి వీల్లేదని తీర్మానించుకున్న వాళ్ళు ప్రపంచంలో ఇద్దరు ముగ్గు రున్నారు. వాళ్ళ ప్రేమమీద బతుకుతున్నాను. అట్లా బతికే అధికారం నాకుందో లేదో నాకైతే తెలియదు. వాళ్ళు జీవించి ఉండగా లేదని నా నోటిమీదిగా అనటం కృతఘ్నతగా తోస్తున్నది. వాళ్ళు నాకు డబ్బేకాక అది ఉపయోగించే అధికారం కూడా ఇస్తున్నారు."

"నీకు మతిపోయింది! వాళ్ళిస్తే మాత్రం నువు తీసుకోవటమేమిటి? వాళ్ళ మీద నీకుగల సహృదయత్వమంతా స్వార్థంగాని ఇంకొకటికాదు- నూటికి నూరుపాళ్ళూ స్వార్థం!"

"స్వార్థమే ప్రేమ అనీ, అదే భగవంతుడనీ ఇంకా నువు తెలుసుకోలేదా?"

"నీకు కృతజ్ఞత అనేది లేదా?"

"అది తప్పు ఇంకేమీ లేదు."

"అయితే నీకు సహాయులుగా ఉన్న వాళ్ళమీది భారం ఎందుకు తగ్గించవు? ఉద్యోగం ఎందుకు సంపాదించవు? నెలకొక పాతిక సంపాదిస్తే అంత వరకైనా వాళ్ళకు తేలిక అవుతుంది కదా?"

"నేను ప్రయత్నం చెయ్యలేదా? లాభం లేదు. నాకు చిన్న ఉద్యోగాలు సంపాదించటం చాతకాదు."

"ప్రయత్నించావా?"

"ప్రయత్నించాను. ఒక చోటికిపోతే అక్కడ ఒక పెద్ద మనిషి ఉంది, నన్నెరుగునో ఏం ఖర్మమో. నన్ను చూడగానే, 'దయ చెయ్యండి' అని కుర్చీ చూపించాడు. ఆయన్ను ఉద్యోగం అడగటం నాచేత కాలేదు. మరొకచోటికి పోయి గుండె రాయి చేసుకుని అడిగితే 'ఏం వేళాకోళమండీ, పంతులుగారూ!' అని సమాధానం వచ్చింది. మరొక చోటికి మాసిన గుడ్డలు వేసుకుపోయి ఎట్లాగో పదిహేను రూపాయల ఉద్యోగం సంపాదించాను. నా కా ఉద్యోగం ఇచ్చిన షావుకారు మర్నాడు సాయంకాలానికల్లా నా చేతిలో రూపాయి పెట్టి 'మీరు రేపటినించీ రావద్దు లెండి పంతులుగారూ!" అన్నాడు. నే నేం తప్పు చేశానో తెలియలేదు. మర్నాడు నాసాటి గుమాస్తా కనిపించి నిజమో అబద్ధమో అన్నాడు: 'మీకా షావుకారు పని చెప్పలేడు. మిమ్మల్ని చూస్తే ఆయనకు పెద్ద భయం. మీ రాయనకన్న పెద్ద అధికారిగా ఉంటే మీకెట్లా ఉద్యోగం ఇస్తాడు?' అన్నాడు. నా వాలకంలో ఉద్యోగస్థుడి లక్షణం కనిపిస్తుందా ఏమిటి?"

"ఆ సంగతి నీకు మరో విధంగా ఎన్నడో చెప్పాను. దారిద్ర్యం కూడా విద్య నేర్చుకున్నట్టు నేర్చుకోవాలి. అదొక బాధ్యత. ఒక రకంగా కనిపించాలి. ఒక విధంగా మాట్లాడాలి. నీ దగ్గర ఆ లక్షణాలు లేవు. నీకు ఉద్యోగం దొరకదు. ఇప్పటికైనా-"

"లాభంలేదు. నాకీ చిన్నచిన్న ఉద్యోగా లిచ్చే వాళ్ళను చూస్తే భయ భక్తు లిప్పుడు కలగడమంటే కలగవు....ఈ చిన్న ఉద్యోగాలు లాభం లేదు. ఎప్పుడో పెద్ద ఉద్యోగమే సంపాదించాలి. సంపాదిస్తాను కూడానూ! కనీసం నా భార్య కోసమైనా సంపాదిస్తాను. దాన్ని బతికున్నంత కాలమూ బంగారపు మేడలో తూగుటుయ్యాలలో పెట్టి ఊపినా దాని ఋణం తీరదు."

"పెద్ద ఉద్యోగాలెట్లా సంపాదిస్తావు?"

"నాలో విశ్వాసం ఉన్న ఇద్దరు ముగ్గురి ఆశీర్వాదబలం వల్ల. వాళ్ళ విశ్వాసం ఊరికే పోతే ప్రపంచంలో ధర్మం లేదు!"

"పోనీ, దానికన్నా ప్రయత్నం చెయ్యవేం?"

"నాకు ప్రయత్నాలలో విశ్వాసం పోయింది!"

"ప్రయత్నం చెయ్యకుండానే?"

"నా అనుభవం వల్ల తెలుసుకునేదే జ్ఞానమైతే నేనేం మనిషిని? లోకంలో ఎంతమంది దరిద్రులు పొట్ట పోషించుకోలేకుండా ఉన్నారు! ప్రయత్నం చాలకనా? కాదు, దేవుడు అనుకూలించక! నాకు కూడా విధి అనుకూలించే సమయానికి పెద్ద ఉద్యోగం అదే వస్తుంది."

"నీ ప్రయత్నం లేకుండానే?"

"అప్పుడే ప్రయత్నం చేస్తాను. ఆ ప్రయత్నం ఫలిస్తుంది."

"విధిని విశ్వసించటం ధనికుల్లో ప్రారంభించిన జాడ్యమే నన నేనిప్పుడు తెలుసుకున్నాను."

"అది జిజ్ఞాసాపరులలో ఉత్పత్తి అయిన జ్ఞానముని నా కిదివరకే తెలుసు. దరిద్రుడికి జిజ్ఞాసాపరత్వం ఎందు కుంటుందీ? తను ప్రయత్నం తోనే ప్రపంచాన్ని భూలోక స్వర్గం చెయ్యగల్గవచ్చు ననుకునేది ఎప్పటికైనా దరిద్రుడే!"

"ఎప్పుడో నీకు పెద్ద ఉద్యోగం అయితే అంతదాకా?"

"ఇట్లాగే!....సుఖంగా ఉందని నే ననను. ఈ క్షణాన నా చేతిలో బొత్తిగా డబ్బాడటం లేదు. ఈ పరీక్షకు తట్టుకో గలిగితే— దారిద్ర్యం వచ్చినప్పటికీ నా ఆత్మ దరిద్రుడుఆత్మ అయిపోకుండా ఉంటే— మంచి రోజులు వచ్చేవరకూ ఈమాత్ర కష్టాలు ఏదోవిధంగా అనుభవించగలను!"

"కావలిస్తే ఈసారికి నేనో అయిదు రూపాయ లిచ్చుకోగలను!"

"ఎబ్బే, అవసరం లేదు. నాదగ్గిర పది రూపాయల కాగితం లేకపోలేదు!"

* * *

బేషయిన పని చేశారు. మీరిద్దరూ కలిసి! గోపాలమూ నువ్వూ మానేజింగు ఏజంట్లా? ఇద్దరికీ కలిపి జీతమెంతా? ఐదు పందలు! బాగుంది. షేర్లన్నీ పోగయినట్టేనా?"

"ఎన్నడో పోగయినై. గోపాలం నన్ను తీసుకున్నదే అందుకు! ఈ సంవత్సర కాలంలో చితికిపోవటం వల్ల నా మాట చలామణీ కాదేమో అనుకున్నాను. కాని అదృష్టవశాత్తూ దారిద్ర్యం నన్ను ఎంత పీడించినా జయించను మాత్రం జయించలేదు. పాపం, నేను వెళ్ళి అడగటం వ్యవధానంగా పెద్దపెద్ద వాళ్ళంతా షేర్లు వేశారు."

"ఇటువంటి దానికి పూనుకుంటే నువ్వెన్నడో బాగుపడి పొయ్యే వాడివి,

నాబోటి వాడికి ఇటువంటి కార్య భారం దుర్ఘటం కాని, నీకేమిటి? నువ్వు జయిస్తావని నేను మొదటినించీ ఎరుగుదును!"

"కాని నాతో ఎన్నడూ అనలేదు."

"నిజం? నువు పొరపాటు పడ్డావు. నేను చాలాసార్లదే చెప్పాను. నువ్వేదో చిల్లర ఉద్యోగాల కోసం ప్రయత్నించావు గాని ఇట్లా కంపెనీ ఫ్లోట్ చేస్తే నీ కెన్నడూ తిరుగుండేది కాదు. ఆ సంగతి నేనేమిటి, చంటి పిల్లవాణ్ణడిగినా చెబుతాడు. సరే కాని మా బావమరిది ఒకడున్నాడు. వాడు ఐదుద్దాయల్లే తిరిగి చెడిపోతున్నాడు. అన్ని రకాల దురభ్యాసాలూ అలవాటు చేశాడు. వెధవ, వాణ్ని పట్టపగ్గాలు లేకుండా ఉన్నై. వాణ్ని కాస్త మీ ఆఫీసులో ప్రవేశ పెట్టి—"

"క్షమించాలి. నా స్నేహితుల తాలూకు మనుష్యులు — చాలా బుద్ధిమంతులూ, సమర్థులూ— ఎందరో ఉన్నారు. వాళ్ళ కందరికీ ఏర్పాటు చేసి ఆ తరవాత నా దారిద్ర్యాన్ని నిరసించినవాళ్ళ సంగతి చూస్తాను. గుడివెనింగ్!"

[ముద్రణ : కాలభైరవుడు కథల సంపుటి,
ప్రథమ ముద్రణ : యువ బుక్ డిపో, మద్రాసు]